సమాధానం చెప్పేవారే లేరు !

- కూటమి పాలనలో సచివాలయాలు నిర్వీరం
- పలుచోట్ల సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పథకాల మంజూరుకు అవస్థలు

మంగళగిరి: ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. గత ప్రభుత్వంపై అక్కసుతో, దురుద్దేశంతో వ్యవహరిస్తోంది. సిబ్బందితో, పథకాల లబ్ధిదారులతో సందడిగా ఉన్న సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. పలుచోట్ల సిబ్బంది కొరతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

సేవలకు కత్తెర

సచివాలయాల్లో నేడు సమాధానం చెప్పేవారే కరువయ్యారు. గతంలో డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్ , విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, ఉద్యాన శాఖ, ఇంజినీరింగ్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వో, వెటర్నరీ అసిస్టెంట్, ఏఎన్ఎం, సెరీ కల్చర్, మత్స్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం వీరంతా ఇతర శాఖలకు డెప్యుటేషన్ మీద వెళ్లారు.



ఇద్దరితో నడుస్తున్న మంగళగిరి సచివాలయం

- సిబ్బందిని తగ్గించడంతో పాటు కూటమి ప్రభుత్వం సేవల్ని కూడా కుదించింది. సచివాలయాల ద్వారా గతంలో 526 సేవలు అందితే, ప్రస్తుతం పట్టుమని పది సేవలు కూడా అందడం లేదు.
- మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 65, దుగ్గిరాల మండలంలో 17 సచివాలయాలు న్నాయి.
- గత ప్రభుత్వంలో ఒక్కో సచివాలయంలో పట్టణంలో అయితే 10 మంది, గ్రామ సచివాలయాలలో 13 మంది ప్రజలకు సేవలందించారు. ప్రస్తుతం ఆరుగురికి కుదించారు.
- మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 65 సచివాలయాల్లో 650 మంది సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం 440 మంది మాత్రమే ఉన్నారు.

ప్రజలకు తిప్పలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు సచివాలయాల ద్వారా పలు సేవలు అందేవి. పింఛన్లకు దరఖాస్తులు, రైతు భరోసా, రైతులకు ఎరువులు, విత్తనాలు సరఫరా, రేషన్ కార్డులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, బిల్ పేమెంట్స్, దివ్యాంగులకు సదరన్ పత్రాలు... ఇలా దరఖాస్తులు చేసుకుని సత్వరమే పొందేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాకా సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కార్యాలయాల చుట్టూ పలుమార్లు తిరిగినా ప్రయోజనం ఉండటం లేదు. దీంతో మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. మరికొన్ని సేవలకు మీ సేవా కేంద్రాలకు వెళ్లి వంద రూపాయలు ఇచ్చి పనులు చేయించుకోవాల్సి వస్తోంది. కులం, ఆదాయం, ఎన్‌బీ, అడంగల్ టైటిల్ డీడ్ , రెవెన్యూ పరమైన కీలకమైన సేవలు సచివాలయాలలో అందకపోవడంతో చిన్నపాటి పనులకు సైతం మండల కేంద్రాలకు వెళ్లక తప్పడం లేదు.

- దుగ్గిరాలలో మండలంలోని 17 సచివాలయాల్లో 221 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం 125 మంది మాత్రమే ఉన్నారు.

హామీతో నిరసన విరమించిన కార్మికులు



మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఎం బుక్ కార్మికుల సంఘటితంగా పోరాటం చేసి విజయం సాధించారని సీఐటీయూ నాయకులు వి.వి. జవహర్‌లాల్ అన్నారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో శనివారం రాత్రి ఎం బుక్ కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. జిల్లా నాయకులు ఎస్.ఎస్. చెంగయ్య మాట్లాడుతూ ఎం బుక్ కార్మికుల శ్రమ దోపిడీని నిరసిస్తూ ఏడు రోజులు ఆందోళన చేసి విజయం సాధించినట్లు చెప్పారు. సంఘటితంగా ఉంటే ఎంతటి సమస్య అయినా పరిష్కారం అవుతుందని తెలిపారు. కాంట్రాక్టర్ నెలకు రూ. 11,000 వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని, నెలకు నాలుగు రోజులు సెలవులు కూడా ఇస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. దీంతో కార్మికులు నిరసన విరమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం. బాలాజీ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ మంగళగిరి పట్టణ నాయకులు పుణ్యవతి, రజని పాల్గొన్నారు.

క్లుప్తంగా

యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరపాలి



తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో కూటమి ప్రభుత్వం చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి, మద్దతు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన తాడేపల్లి సిమెంట్ ఫ్యాక్టరీని యాజమాన్యం అసమర్థుల చేతిలో పెట్టి అస్తవ్యస్తం చేసిందని తెలిపారు. 333 మంది కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించామని, యజమాని కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, సూర్య ప్రకాశ రావు, నాగేశ్వరరావు, కార్మికులు ఇమాంబి, శారమ్మ, శివకుమారి, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

నేడు రావెలలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

తాడికొండ: మండలంలోని రావెలలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'పై ఆదివారం రచ్చబండ నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ మండల అధ్యక్షులు ముప్పాళ్ల మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు హాజరు కానున్నారని ఆయన తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల సభ్యులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్




తెనాలిటౌన్: విద్యతోనే ఉన్నత భవిష్యత్ సాధ్యపడుతుందని పేదరికాన్ని జయించగలమని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి బి.ఆనంద్‌కిరణ్ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని చొప్పర రత్నకుమారి ట్యూషన్‌లోని పేద విద్యార్థులకు ఆనంద్‌కిరణ్ సహకారంతో శనివారం నోటుబుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఈ సుదర్శన్, రావూరి శ్యామ్‌సుందర్, పీఈటీ కె.మోజెస్, రావూరి భరద్వాజ పాల్గొన్నారు.

బుర్రిపాలెంలో మెగా మెడికల్ క్యాంప్



తెనాలిటౌన్: సూపర్‌స్టార్ మహేష్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా శనివారం రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో ఆంధ్ర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడిసిన్, సర్జరీ, పిల్లల వైద్యులు, గుండె జబ్బుల వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆంధ్ర హాస్పటల్ డైరెక్టర్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.వి.రామారావు మాట్లాడుతూ మహేష్‌బాబు దత్తత గ్రామమైన బుర్రిపాలెంలో ఇప్పటి వరకు 45 మెడికల్ క్యాంపులు నిర్వహించినట్లు చెప్పారు. గ్రామాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మోడల్ హెల్త్ విలేజ్‌గా తీర్చిదిద్దాలనే సకల్పంతో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సయ్యద్ ముదసిర్, డాక్టర్ శిరీష, డాక్టర్ అమర్, డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

మహనీయుడు ఫణికుమార్



తెనాలి టౌన్: అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మహనీయుడు కళ్లేపల్లి ఫణికుమార్ సేవలు చిరస్మరణీయమని అర్చక సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.అనంతాచార్యులు పేర్కొన్నారు. శనివారం స్థానిక గోవర్ధనస్వామి దేవాలయంలో ఫణికుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అర్చక సమాఖ్య ఉపాధ్యక్షునిగా ఫణికుమార్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా అర్చకుల సంక్షేమం కోసం ఫణికుమార్ అలుపెరుగని పోరాటం చేశారని చెప్పారు. కార్యక్రమంలో టి.రఘు, హరిబాబు, పి.సుబ్బారావు, భాష్యం శేషుకుమార్, శ్రీకాంత్, కేసవ, యశ్వంత్, చక్రవర్తి, శ్రీనివాసరావు, యోగానంద చక్రవర్తి, పాల్గొన్నారు.

బాబు జమానాలో కష్టాలు గ్యారంటీ

- మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి
- ఎప్పుడు అధికారంలో ఉన్నా ఇదే తంతు
- ఎన్నికలకు ముందు మొసలి కన్నీళ్లు
- గట్టెక్కిన తరువాత ఆ ఊసే ఉండదు
- అదే బాబు స్పెషాలిటీ



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్: చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తారన్న విషయం మరోసారి రుజువైందని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో శనివారం రూరల్ అధ్యక్షులు అమరా నాగేశ్వరరావు (నాగయ్య) అధ్యక్షతన జరిగిన 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు మొసలి కన్నీరు కార్చి ప్రజల్ని మోసం చేశారని తెలిపారు. ఎప్పుడు ఎన్నికల్లో పోటీచేసినా ఏదో ఒక పార్టీ మద్దతుతో కల్లబొల్లి కబుర్లు చెబుతాడని, గెలిచిన తరువాత ప్లేటు మారుస్తాడని విమర్శించారు. ఏరు దాటేంత వరకు మల్లన్న.. ఏరు దాటిన తరువాత బోడి మల్లన్న చందంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. గతంలో మిత్రపక్షంగా ఉండేవారు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన ఒత్తిడి తీసుకు వచ్చేవారని తెలిపారు. ఇప్పుడు మిత్రపక్షంగా ఉన్న జనసేన, బీజేపీలు భజన బృందంగా మారడంతో ఆయన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్ రెడ్డి కరెంటును అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తే, విద్యుత్ పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని కూటమి నాయకులు ప్రచారం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే విద్యుత్‌ను యూనిట్‌కు నాలుగు రూపాయలకు పైగా కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళుతుంటే హామీలు అమలు చేయండని నిలదీస్తున్నారని చెప్పారు. సంవత్సరంలోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, దాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అయినా కార్యకర్తలు భయపడకుండా ప్రజా సమస్యలపై పోరాడటం సంతోషించదగ్గ విషయమని తెలిపారు.



ప్రసంగిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

అనంతరం చంద్రబాబు నాయుడు మోసాలపై క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణమూర్తి, కళ్లం పిచ్చిరెడ్డి, చందు, మోదుగుల బ్రహ్మారెడ్డి, పాటిబండ్ల గంగాధర్, మేక దామేశ్వరరెడ్డి, డేవిడ్ బాబు, నెమలికంటి పుల్లారావు, శివశంకర్, రాజేష్, మేకల రమేష్, రాంబాబు, అర్జునరావు, జె. కోటేశ్వరరావు, జి. మోజెస్ పాల్గొన్నారు.

నిడమర్రులో పోలీసుల పల్లె నిద్ర

నిడమర్రు(మంగళగిరి): మండలంలోని నిడమర్రు టిడ్కో గృహ సముదాయంలో పోలీసులు శనివారం రాత్రి పల్లె నిద్ర నిర్వహించారు. ఇక్కడ శుక్రవారం మైనర్ బాలికపై అత్యాచారం ఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ ఎస్. వెంకట్ మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు, చోరీలు జరగకుండా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా నిద్రపోయేలా చూడడమే పల్లె నిద్ర లక్ష్యమని చెప్పారు. అపరిచిత వ్యక్తులు, అనుమానితులు కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఇక్కడ రోడ్లపై కొందరు వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని, రాత్రి పూట మద్యం తాగి గొడవలు చేస్తున్నారని గుర్తించినట్లు చెప్పారు. గుర్తింపు లేని వ్యక్తులకు ఇళ్లు అద్దెలకు ఇస్తుండటంతో సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఇకపై అలాంటి ఘటనలు జరక్కుండా నిఘా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పల్లె నిద్ర చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.



నిడమర్రులో పల్లె నిద్రకు వెళ్లిన పోలీసులు

భూములు తీసుకుంటే సహించం !

వ్యకాస రాష్ట్ర నాయకురాలు శివ నాగరాణి

తాడికొండ: అభివృద్ధి మాటున అవసరాలకు మించి రెండు, మూడు పంటలు పండే సారవంతమైన భూములను రైతుల ఆమోదం లేకుండా తీసుకోవడం సరైనది కాదని ఏపీ వ్యకాస రాష్ట్ర నాయకురాలు వంకాయలపాటి శివ నాగరాణి అన్నారు. ఆదివారం రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం ప్రతిపాదించిన తుళ్లూరు మండలంలోని పెదపరిమి, వడ్లమాను హరిశ్చంద్రపురం గ్రామాల్లో ప్రజాసంఘాల నాయకులు ఎం. రవితో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సాగునీటి ప్రాజెక్టుల కోసం భూముల సేకరిస్తే అభ్యంతరం లేదన్నారు. ఇప్పుడు అభివృద్ధి మాటున జరుగుతున్న దోపిడీని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వమే కార్పొరేట్లతో కుమ్మక్కై భూ వ్యాపారం చేస్తోందని విమర్శించారు. తరతరాలుగా భూమి మీద ఆధారపడిన రైతు, కూలీలను బజారు కీడుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులంతా ఆగస్టు 10న ఉదయం పది గంటలకు విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే చర్చావేదికలో పాల్గొనాలని ఆమె కోరారు. ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి, అడ్డగోలుగా పోలీసుల్ని ఉపయోగించి రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవడం ఆపేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, సీహెచ్. రవికుమార్, నల్లూరి మాధవరావు, నర్రా శ్రీనివాసరావుతో పాటు, భూ ఆందోళనలో ప్రత్యక్ష అనుభవం ఉన్న రైతు సంఘం మాజీ కార్యదర్శి వి. శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు ఎం రవి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న శివ నాగరాణి

ఘనంగా ఆదివాసి దినోత్సవం



ఏకలవ్య, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దేవానంద్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివాసి దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తాడేపల్లి పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షులు బాలసాని దేవసుందరం (అనిల్), నాయకులు ఏకలవ్య, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆదివాసులు అడవితల్లి ముద్దుబిడ్డలని, ఈ సమాజానికి మూల వారసులని తెలిపారు. ప్రాచీన చరిత్రకు, సంస్కృతికి, సంప్రదాయాలకు, నిరాడంబరతకు నిలువుటద్దం ఆదివాసీయులని పేర్కొన్నారు. అడవితల్లి బిడ్డలకు ప్రపంచ ఆదివాసుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు , నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు చైతన్య, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరి మానుపాటి సుధీర్, తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, పట్టణ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు గుత్తి అశోక్, సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి సాతుపాటి రాహుల్, సీనియర్ నాయకులు పేరం శ్రీను, ఇట్టా శంకర్, కర్రెద్దుల కిరణ్, మానుపాటి రవి, ఉయ్యాల శ్రీను, కంపా నారాయణ, కోటేశ్వరరావు, రోహిత్ పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడాలి

దుగ్గిరాల: గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని జై భీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కలెవరపు దేవానంద్ కోరారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా శనివారం రైలుపేటలోని ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులు కోసం గిరిజనులను చైతన్య పరుస్తూ, వారి అభ్యున్నతి కోసం తమ సంస్థ నిరంతరం పాటుపడుతోందని తెలిపారు. తెనాలి బండ్ మీద గిరిజనుల ఆత్మగౌరవ చిహ్నంగా ఏకలవ్యుని విగ్రహాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసి, దళిత బిడ్డలకు జై భీమ్ ఫెడరేషన్ అండగా ఉంటుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నేత షేక్ సుభాని మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగలకుదురు ఎంపీటీసీ సభ్యురాలు పేరం అరుణ, ఉన్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

దుర అలవాట్లకు దూరంగా ఉండండి

తెనాలిఅర్బన్: విద్యార్థులు దుర అలవాట్లకు దూరంగా ఉండాలని నందులపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. నాజరుపేటలోని ప్రభుత్వ బాలుర వసతిగృహంలో శనివారం వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ప్రతి రోజూ తీసుకోవాలని సూచించారు. భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ దోమకాటు వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, బోదకాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో వసతి గృహ సంక్షేమాధికారి జెట్టి మరియరాజు, ఏఎన్ఎంలు, మలేరియా సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

పేదలకు దుప్పట్లు పంపిణీ

తెనాలిఅర్బన్: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో శనివారం వృద్ధులు, వికలాంగులు, నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రామకృష్ణ సేవా సమితి చైర్మన్ ముమ్మనేని భానుమతి మాట్లాడుతూ 2008లో రామకృష్ణ పరమహంస స్ఫూర్తితో సంస్థను ప్రారంభించామని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కుర్రా శ్రీను, నరేంద్ర, సీహెచ్.శ్రీను, శివ, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తెనాలి రూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. త్రీ టౌన్ ఎస్ఐ కరీముల్లా కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేటకు చెందిన నారా లక్ష్మి(40) భర్త రామ్మోహనరావు మూడు నెలల కిందట అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఆయన గతంలో చేసిన అప్పుల వారు లక్ష్మికి నోటీసులు పంపి అప్పులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన ఇంట్లో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. వైద్యశాల నుండి రాత్రికి వచ్చిన సమాచరం, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

12న తెనాలిలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం

తెనాలి అర్బన్: క్విట్‌ఇండియా ఉద్యమంలో అమరులైన స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకునేందుకు ఈనెల 12వ తేదీన తెనాలి రణరంగచౌక్‌లో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓవర్ బ్రిడ్జి సమీపంలోని అమరవీరుల స్థూపాలకు ఉదయం 9 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం సమావేశం జరుగుతుందని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగే సమావేశంలో ముఖ్యఅతిథులుగా కేంద్ర గ్రామీణ అభివృద్ధి, సమాచార సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహా, మున్సిపల్ ఆర్డీ సూర్యదేవర హరికృష్ణ, తదితరులు పాల్గొంటారని చెప్పారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని సత్కరించనున్నట్లు వివరించారు. అందరూ పాల్గొనాలని కోరారు.

హామీలు మరచిన కూటమి ప్రభుత్వం



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఫిరంగిపురం: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తిగా మరచిపోయిందని సర్పంచ్ దాసరి మెల్కియా విమర్శించారు. మండలంలోని గొల్లపాలెంలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దాసరి మెల్కియా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో కోతలు పెట్టారన్నారు. తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవలో మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి గ్రామంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిట్టా అంజిరెడ్డి, దాసరి సురేష్, జొన్నలగడ్డ ఆనంద్, చేవూరి రామమోహన్‌రెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, కొమ్మారెడ్డి ప్రవీణ్‌రెడ్డి, పెరికల చిన్నా, షేక్ మస్తాన్‌వలి, సయ్యద్ సైదులు, బి.సాల్మన్, మోరంరెడ్డి, అమానుల్లా, స్వర్ణ చిన్నప్ప, సంగీతరావు, గోపి, జోసఫ్, డి.పూర్ణయ్య, డి.హనుమయ్య, డి.లూర్దయ్య పాల్గొన్నారు.